

ESTD : 1999

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి కరీంనగర్ జిల్లా

జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి సోమవారం అక్టోబర్ 26,2026


# అల్లీపూర్‌లో ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరం

## 200 మందికి వైద్య పరీక్షలు.. నిరుపేదలకు ఉచితంగా మందుల పంపిణీ

**జగిత్యాల డివిజన్ ఇంచార్జి అక్టోబర్ 23 (విజన్ ఆంధ్ర )**



జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో గంగారం చర్మవ్యాధుల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ యెనుగందుల నరేశ్, గైనకాలజిస్ట్ డాక్టర్ శుభాంగి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి అల్లీపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 200 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ నరేశ్ చర్మవ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. చర్మ సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో 8వ వార్డు సభ్యుడు అనుమల్ల రాజ్‌కుమార్‌తో పాటు ఎలిగేటి మనోజ్, మ్యాకల రాజశేఖర్, వేముల సతీష్, పొట్టవత్తిని నాగభూషణం, మోర శివ, అనుమల్ల మల్లేశం, రాజేందర్, సిరిపురం ఆనంద్, మిట్టపెల్లి దామోదర్, రాచర్ల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల మాటున అక్రమ నిర్మాణాలా?

## నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారా?
## మెట్‌పల్లిలో ప్రైవేట్ విద్యాసంస్థల నిర్మాణాలపై ఆరోపణలు
## నిబంధనలు బేఖాతరు చేస్తే చర్యలు తీసుకునేదెవరు?

**మెట్‌పల్లి అక్టోబర్ 25(విజన్ ఆంధ్ర):**



చట్టాలు సామాన్యులకేనా? నిబంధనలు ప్రైవేట్ పాఠశాలలకు వర్తించవా? అక్రమ నిర్మాణాలపై నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? మెట్‌పల్లి పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థల నిర్మాణాలపై వినిపిస్తున్న ఆరోపణలు మున్సిపల్ అధికారుల పనితీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. విద్యార్థులకు క్రమశిక్షణ, చట్టాల పట్ల గౌరవం నేర్పాల్సిన పాఠశాలల్లోనే నిర్మాణ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. పేజి 2లో

# పేదల వైద్యానికి ప్రజా ప్రభుత్వమే అండ

## సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా
## ఆరోగ్యశ్రీతో రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం.. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో)**



ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్), రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా పేదలకు ఆర్థిక సహాయం అందిస్తూ మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.వేములవాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం మాతృశ్రీ, అశ్విని, వర్ష ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేజి 5లో

# ధర్మపురి బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

## రూ. 2.57 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక సౌకర్యాల కల్పన
## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రూ. 13 వేల కోట్ల మేర లబ్ధి
## 2027 గోదావరి పుష్కరాల కోసం రూ. 226 కోట్లతో అభివృద్ధి పనులు

**జగిత్యాల అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో):**

ధర్మపురి బస్‌స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రూ. 2.57 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు.

### బస్‌స్టేషన్‌లో ఆధునిక సౌకర్యాలు

ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రాజెక్టులో భాగంగా రెండు ప్లాట్‌ఫారాల విస్తరణ, సీసీ పేవ్‌మెంట్, గ్రానైట్ ఫ్లోరింగ్, భవనానికి ఏసీపీ క్లాడింగ్, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు, రూఫ్ స్లాబ్, సీలింగ్ మరమ్మతులు చేపట్టనున్నారు. అదేవిధంగా వర్షపు నీటి



పారుదల వ్యవస్థ అభివృద్ధి, పెయింటింగ్, పల్లపు ప్రాంతాల్లో కంకర వేయడం, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుదీకరణ, పంప్‌సెట్‌తో కూడిన బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నారు.

పేజి 2లో

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

## : : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్

**రూ.200 కోట్లతో జగిత్యాల జిల్లా తాటిపల్లి లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం**
**25 ఎకరాల్లో 2,500 మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్య**
**వచ్చే విద్యా సంవత్సరం నాటికి కనీసం 10 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో తరగతుల ప్రారంభానికి చర్యలు**
**గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు**
**విద్య, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం**
**జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు మంత్రుల శంకుస్థాపన**

**జగిత్యాల, అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో):**

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తన రాజకీయ ప్రస్థానం విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైందని తెలిపారు. పేద ప్రజలకు అందించగలిగే అత్యంత విలువైన సంపద విద్యేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని



పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ విద్య ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్న విషయం స్పష్టమైందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగారని, గురుకుల విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రాష్ట్రంలోని 326 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పేజి 2లో

# పాఠశాలల మాటున అక్రమ నిర్మాణాలా?

(మొదటి పేజీ తరువాయి..)



### నోటీసులకే పరిమితమైన పర్యవేక్షణ!

మెట్‌పల్లి పట్టణంలోని నిఖిల్ భారత్ కాన్వెంట్ స్కూల్, అరపేటలోని వాగ్దేవి స్కూల్, వెంకట్రావుపేటలోని బ్రూక్లిన్ స్కూల్ తదితర విద్యాసంస్థల్లో చేపట్టిన నిర్మాణాలపై స్థానికంగా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవనాలు, షెడ్ల నిర్మాణాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? మంజూరైన ప్లాన్ల ప్రకారమే నిర్మాణాలు చేపట్టారా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే అధికారులు ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు కరువవుతున్నాయి.

నిర్మాణాల ఉల్లంఘనలపై నోటీసులు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, వాటి అనంతరం తీసుకున్న చర్యలపై స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నోటీసులు ఇవ్వడం, వివరణలు కోరడంతోనే అధికారుల బాధ్యత ముగుస్తుందా? ఉల్లంఘనలు నిర్ధారణ అయితే తదుపరి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### అధికారుల అలసత్వమా.. పర్యవేక్షణ లోపమా?

మున్సిపల్ పరిధిలో నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఫిర్యాదులు, నోటీసుల వ్యవహారం దాటి క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిగాయా? ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలిన నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకు జరుగుతోంది? నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోనేందుకు వెనుకాడటానికి కారణాలేమిటి? ఈ ప్రశ్నలకు మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

### విద్యార్థుల భద్రతతో చెలగాటమా?

పాఠశాల భవనాల విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారే ప్రమాదం ఉంది. భవన నిర్మాణ స్థిరత్వం, అగ్నిమాపక భద్రత, అత్యవసర మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు, అవసరమైన అనుమతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయా లేదా అన్నది నిర్ధారించకుండా ఆరోపణలను విస్మరించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

### తనిఖీలు చేసి నిజాలు తేల్చాలి!

మెట్‌పల్లి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల నిర్మాణాలపై మున్సిపల్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు, మంజూరైన నిర్మాణ ప్రణాళికలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### నోటీసులతోనే సరిపెడతారా? నిబంధనల ఉల్లంఘనలను నిర్ధారించి చర్యలకు దిగుతారా?

మెట్‌పల్లి మున్సిపల్ అధికారుల తదుపరి అడుగులపై ఇప్పుడు ప్రజల దృష్టి నెలకొంది. ఆరోపణలపై అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? లేక ఈ వ్యవహారం కూడా నోటీసులకే పరిమితమవుతుందా? అన్నది వేచి చూడాలి.

# ధర్మపురి బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి..)

### మహిళలకు ఉచిత ప్రయాణం.. ఆర్టీసీ సేవల విస్తరణ

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 360 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా మహిళలకు దాదాపు రూ. 13 వేల కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు.ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు విస్తరించడంతోపాటు బాసర, భద్రాచలం, ధర్మపురి, గూడెం, కాళేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ధర్మపురి నుంచి ముంబైకి ఏసీ బస్సు నడిపే ప్రతిపాదనను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

### ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటుకు చర్యలు

1993లో ప్రారంభమైన ధర్మపురి బస్‌స్టేషన్‌ను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటు చేయాలన్న స్థానిక ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఎన్నికలకు ముందే డిపో నిర్మాణానికి శంకుస్థాపన జరిగేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కోరినట్లు వెల్లడించారు.

### పుష్కరాల అభివృద్ధికి రూ. 226 కోట్లు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాలు, ఘాట్లు, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి



ఆలయ పునర్నిర్మాణానికి రూ. 10 కోట్లు, పుష్కర ఘాట్లు, బైపాస్ రహదారులు తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ. 226 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, బస్‌స్టేషన్ ఆధునీకరణతో వారికి మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఆలయాలు, ఘాట్లు, రహదారుల అభివృద్ధితో పుష్కరాల సమయంలో భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు.

### నాణ్యతతో పనులు పూర్తి చేయాలి:: కలెక్టర్

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేపట్టి, నాణ్యత విషయంలో రాజీ పడకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వర్షపు నీటి పారుదల వంటి సదుపాయాలు సక్రమంగా అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ దినేష్,ఆర్.టి.సి. అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం :: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి..)

పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని తెలిపారు.

ప్రస్తుత ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఒకే ప్రాంగణంలో నాలుగు గురుకుల విద్యాసంస్థలకు అవసరమైన భవనాలను నిర్మించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరూ ఒకే చోట విద్యనభ్యసించేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.వచ్చే విద్యా సంవత్సరం నాటికి కనీసం 10 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గురుకుల విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. గురుకులాలకు సంబంధించిన బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా క్రమం తప్పకుండా చెల్లించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

### సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పెట్టుబడి సాయం పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.25 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్ల మేర రుణమాఫీ చేశామని, రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా 75 వేల ఉద్యోగాల నియామకాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

### సూపర్ ఎల్‌నినోను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలి

పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని, రాష్ట్రంలో కరువును ఎదుర్కొనేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయాలకు ముడిపెట్టి విమర్శలు చేయడం సరికాదన్నారు.గతంలో కొండగట్టు బస్సు ప్రమాదం, కరోనా వంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు తాము అప్పటి ప్రభుత్వాన్ని నిందించలేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రతి గ్రామంలో నీటి నిల్వలను పెంచేందుకు కుంటలు, వ్యవసాయ భూముల వద్ద పంట కుంటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటూ భూగర్భ జలాల పెంపునకు కృషి చేస్తున్నట్లు వివరించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో విద్యారంగానికి భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముందుకు సాగుతున్నారని తెలిపారు.జగిత్యాలలో ఇటీవల కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాటిపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గతంలో గురుకులాలకు సొంత భవనాలు, నాణ్యమైన ఆహారం వంటి సదుపాయాల కల్పనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పిస్తోందన్నారు.

# గూడెంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ సేవా స్ఫూర్తి.. పంచాయతీ సిబ్బందికి బట్టల పంపిణీ

**సురేష్ మిత్రుడు సుధమల్ల నరేందర్ సహకారంతో సేవా కార్యక్రమం**




**ముస్తాబాద్,అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర)**
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి సురేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందికి బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తాటిపల్లి శంకర్, ఉపసర్పంచ్ భవిత నవీన్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా సిబ్బందికి బట్టలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అవసరమైన బట్టలను నిజామాబాద్‌కు చెందిన మేడి సురేష్ మిత్రుడు సుధమల్ల నరేందర్ అందజేశారు. గ్రామపంచాయతీ సిబ్బందిని గౌరవిస్తూ నిర్వహించిన ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన సుధమల్ల నరేందర్‌కు, వారి కుటుంబ సభ్యులకు ప్రేరణ స్వచ్ఛంద సంస్థ తరపున అధ్యక్షుడు మేడి సురేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమాజ సేవలో భాగంగా గ్రామస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సేవాభావంతో ముందుకు వచ్చి సహకరించిన దాతలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు షాద శ్రీనివాస్, కుమ్మరి ఎల్లం, దండు దేవయ్య, చిట్నేని శ్రీనివాసరావు, ఏర్పుల ప్రవీణ్, మెరుగు రవి, వెంకన్న, కస్తూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 1 నుంచి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభలు

**నవంబర్ 3న సిరిసిల్లలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 42వ వర్ధంతి సభ**



**సిరిసిల్ల, అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర)**
నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవనంలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 42వ వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ, భారత విప్లవోద్యమంలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. మార్క్సిస్టు-లెనినిస్టు భావజాలంతో ప్రజా పోరాటాలకు సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసిన ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సీపీఐ (ఎంఎల్) పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అరుణ జోహార్లు అర్పిస్తోందని తెలిపారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలోనూ, ఇతర ప్రజా ఉద్యమాల్లోనూ ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు, అనారోగ్య కారణాలతో మరణించిన విప్లవోద్యమ కార్యకర్తలకు నివాళు లర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి జీవితం.. పోరాట ప్రస్థానం. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 1917లో కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. కర్నూలులో పాఠశాల విద్యను పూర్తి చేసిన అనంతరం మద్రాసులోని గిండి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమంలో పాల్గొన్నారు. 1940లో జవహర్‌లాల్ నెహ్రూ అరెస్టుకు నిరసనగా నిర్వహించిన విద్యార్థుల సమ్మెలో ఆయన కీలక పాత్ర పోషించారు. కళాశాలలో విద్యార్థుల పట్ల చూపిన అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడినందుకు కళాశాల యాజమాన్యం ఆయనను బహిష్కరించినట్లు నాయకులు తెలిపారు. అప్పటికే కమ్యూనిస్టు ఉద్యమంతో సంబంధాలు ఏర్పరచుకున్న ఆయన, అనంతరం కర్నూలు జిల్లాలో పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తదుపరి పరిణామాల్లో అజ్ఞాత జీవితాన్ని గడిపారని వివరించారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 1984 నవంబర్ 9న పశ్చిమ బెంగాల్‌లో గుండెపోటుతో మరణించారని తెలిపారు. ఆయన మరణించి 42 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నవంబర్ 1 నుంచి 9 వరకు సంస్మరణ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 3న సిరిసిల్లలో వర్ధంతి సభ సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా నవంబర్ 3న సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న ఆదర్శ పద్మశాలి సంఘ భవనంలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 42వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సభకు సిరిసిల్ల పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు, కార్మిక సోదర సోదరీమణులు, కమ్యూనిస్టు ఉద్యమ అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రజెండా బీడీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కామ్రేడ్ మచ్చ అనసూర్య, ఎర్రజెండా పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కామ్రేడ్ గుజ్జె దేవదాస్, తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు కామ్రేడ్ సలేంద్రి ఎల్లయ్య, జక్కని త్రివేణి, పంతం సుజాత, గడదాసు లత, ఆకెన సత్తయ్య, బొల్లబత్తిని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మాలధారణ అనంతరం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు



**ముస్తాబాద్, అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర)**
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు అయ్యప్ప స్వామి దీక్షలో భాగంగా నిన్న రాజు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ చేశారు. ఈ సందర్భంగా ఈరోజు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అయ్యప్ప స్వామి మాలధారణ అనంతరం కేసీఆర్‌ను కలవడం పట్ల జనగామ శరత్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ భేటీ మర్యాదపూర్వకంగా సాగింది. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు.

# హర్నాల ప్రీమియర్ లీగ్ విజేతగా తుర్ఖాషి నగర్ జట్టు.

**కొడిమ్యాల, అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర)**



కొడిమ్యాల మండలం తుర్ఖాషి నగర్ లో ఆదివారం నిర్వహించిన హర్నాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆతిథ్య తుర్ఖాషి నగర్ జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో మొత్తం ఆరు జట్లు పాల్గొనగా, ఫాజిల్ నగర్, తుర్ఖాషి నగర్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. హోరాహోరీగా సాగిన తుది పోరులో తుర్ఖాషి నగర్ జట్టు విజయం సాధించింది. టోర్నీలో విజేత జట్టుకు రూ. 7,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ. 3,500 నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందజేశారు. ఈ పోటీలకు గ్రామ సర్పంచ్ తనవంతు సహకారంగా ట్రోఫీలను స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

# దాసరి ప్రశాంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.....



**ఓదెల అక్టోబర్ 25,(విజన్ ఆంధ్ర)**
పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి కుమారుడు ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మ్యాదగోని శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ విద్యా సంస్థల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి ని తన నివాసంలో కలిసి కండువా కప్పి,స్వామి వారి చిత్రపటం, స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా మ్యాదగోని శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రశాంత్ రెడ్డి ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రానున్న రోజుల్లో ఉన్నతమైన పదవులు సాధించాలని ఆ భగవంతుని వేడుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మ్యాదగోని శ్రీకాంత్ గౌడ్,మాజీ సర్పంచ్ ఓజ్జ శ్రీనివాస్,నాయకులు చల్లపల్లి సురేష్ గౌడ్,గడ్డం అజయ్,బినవేణి పర్శరాములు,శానవేన శ్రీకాంత్,నల్లగోని వీరన్న గౌడ్,షేవినాయక్, దొడ్డిపల్లి శ్రీనివాస్,పూసల సుమన్,గట్టు వినయ్,దొడ్డిపల్లి కుమార్,తుడి సంపత్,చెరుకు సాగర్,సాదరి రమేష్,ఉమేష్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలి: మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్

## చిగురుమామిడి లో ఘనంగా కళాకారుల దినోత్సవం

**చిగురుమామిడి:అక్టోబర్25 (విజన్ ఆంధ్ర)**



చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద ప్రపంచ కళాకారుల దినోత్సవం మండల కళాకారుల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి టెంకాయ కొట్టి మిఠాయిలు తినిపించుకొని ప్రత్యేక పూజలు చేసి భజన పాటలు పాడారు. చిగురుమామిడి కళాకారుల మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ మాట్లాడుతూ కళాకారులు ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజ మునగడ కోసం మంచి చెడులు,ధర్మ ఆధర్మలు, సంస్కృతి సంప్రదాయాలు మంచి విషయాలపై అవగాహన గత చరిత్ర ఆనవాళ్లు భవిష్యత్తు కార్యచరణల గురించి వేష భూషణాలతో కళ్ళకు కట్టినట్టు చూపెడుతూ పద్య,గద్యాలతో వారి పాటలతో అందరినీ మైమరిపించి ఉన్నది ఉన్నట్టు ప్రజలందరికీ తెలిపే ఈ కళాకారులు కడు దయనీయ పరిస్థితులలో ఉన్నారు చాలామంది కళాకారులు నిర్దిష్టమైన పనులు లేకుండా కళల వెంబడి తిరుగుకుంటూ వాళ్ల జీవనోపాధి లేకుండా ఎంతో ఇబ్బందుల పాలవుతున్నారు.కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు పూర్తిస్థాయిలో ఇవ్వాలని అర్హులైన కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి తద్వారా ప్రభుత్వ పథకాల ప్రోత్సాహకం కొరకు వారిని వాడుకోవాలన్నారు అలాగే 50 సంవత్సరాలు దాటిన కళాకారులకు 5000 రూపాయల పింఛను ఇవ్వాలని ప్రతి మండల కేంద్రంలో ఆయా కళాకారుల కమిటీలకు భూషణాల సంబంధించిన కిట్టు, వాయిద్య పరికరాలు అలగే సౌండ్ సిస్టం అందించాలని దాని ద్వారా కళాకారులు ఇంకా ఎక్కువ కార్యక్రమాలు చేసే వీలుంటుందన్నారు.ఈ వసతులు కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్ళను, వ్యక్తిగత రుణాలను కళాకారులకు ప్రత్యేకంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజకుమార్ తో పాటు ఉపాధ్యక్షుడు మూసాపూరి సంపత్, సంయుక్త కార్యదర్శి కుతాడి కొమురయ్య గౌరవ సలహాదారు నిలుగొండ కిషన్ సహాయ కార్యదర్శి మొగిలి బొందయ్య, మల్లం బాలయ్య కళాకారులు అనువోజు ఇంద్రయ్య, శ్రీరామోజు రాములు, బాలయ్య, పత్తేం రాజమల్లు, మద్రి చంద్రయ్య, పోలోజు రమేష్, మినుగుల వెంకటి, పెనుకుల వెంకటి,మినుగుల శ్రీనివాస్, పూల శ్రీనివాసరెడ్డి, కుమారస్వామి, కాశివేణి ఐలయ్య, పోగకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ నేషనల్ అవార్డుకు బోయిని బాబు ఎంపిక

**చిగురుమామిడి :అక్టోబర్25(విజన్ ఆంధ్ర)**




బహుజన సాహిత్య అకాడమీ ఢిల్లీలో ప్రధానం చేసే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జాతీయ అవార్డుకు చిగురుమామిడి మండలానికి చెందిన బోయిని బాబును ఎంపిక చేసామని ఆ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు.ఆదివారం హైదరాబాదులోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలోఎంపిక పత్రాన్ని బాబుకు అందజేశారు.ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా చిరుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని బాబు గత రెండు దశాబ్దాలుగా బహుజన సమాజ్ పార్టీలో కొనసాగుతూ దళిత ప్రజా సంఘాలలో పనిచేస్తూ అంబేద్కర్ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడని అన్నారు.దళిత,బహుజన ప్రజల అభివృద్ధి కోసం,విద్యార్థుల భవిష్యత్తు కోసం పలు కార్యక్రమాలు చేపట్టాడని కొనియాడారు.వారి సేవానిరతిని గుర్తించి ఈ అవార్డుకి ఎంపిక చేశామన్నారు.ఈ ఏడాది నవంబర్ 15న ఢిల్లీలో జరిగే 20వ జాతీయ సదస్సు సందర్భంగా బాబుకు ఈ అవార్డును జాతీయ స్థాయిలో ప్రధానం చేస్తామని తెలిపారు.కాగా అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల బాబు హర్షం వ్యక్తం చేస్తూ,అవార్డు ఎంపికకి సహకరించిన బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర సంపత్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజన్న ఆలయం.. పట్టణ అభివృద్ధి రెండు కళ్లలా

## 80 అడుగుల రహదారి పనుల్లో నాణ్యతకు పెద్దపీట

## క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో):**
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడను ఆధ్యాత్మిక కేంద్రంగా, టెంపుల్ సిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధి, వేములవాడ పట్టణ అభివృద్ధిని రెండు కళ్లలా భావిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పట్టణంలో కొనసాగుతున్న 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను ఆయన మున్సిపల్ పాలకవర్గం, ఆర్అండ్‌బీ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వేములవాడ 80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకుంటున్నాయని తెలిపారు. రహదారి నిర్మాణానికి సుమారు రూ.6.5 కోట్లతో పాటు విద్యుత్ స్తంభాలు, లైటింగ్ ఏర్పాట్లకు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. రహదారి విస్తరణకు సంబంధించి రూ.47 కోట్లతో జీవో తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు.

### రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లకు పైగా నిధులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని విప్ తెలిపారు. ఇప్పటివరకు ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని, ఆలయ అభివృద్ధి పనులు సుమారు 55 శాతం, అన్నదాన సత్రం పనులు 50 శాతం వరకు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అదనంగా రూ.99.40 కోట్ల నిధులు మంజూరు చేయడంతో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.అన్నదాన సత్రానికి సంబంధించి రూ.35 కోట్లతో పాటు దేవాలయ అభివృద్ధికి రూ.51 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు వివరించారు. ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా, శృంగేరి పీఠాధిపతి సూచనలు, భక్తుల



ఆకాంక్షలకు అనుగుణంగా చేపడుతున్నామని తెలిపారు.

### మూడో బ్రిడ్జి పనులకు వేగం.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం ఉండదు

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడో బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేశామని ఆది శ్రీనివాస్ తెలిపారు. గతంలో శంకుస్థాపనలకే పరిమితమైన పనులను ముందుకు తీసుకెళ్లి ప్రజలకు ఉపయోగపడేలా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అభివృద్ధి పనులు కొనసాగుతున్న సమయంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల పునరుద్ధరణ, విస్తరణ, జీర్ణోద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు.గతంలో రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు ఇస్తామని ప్రకటించినప్పటికీ ఆ హామీ అమలులో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం భక్తుల విశ్వాసాలు, సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేస్తోందన్నారు.నిర్వాసితుల సహకారం, త్యాగాల వల్లే రహదారి విస్తరణ పనులు సాధ్యమవుతున్నాయని పేర్కొన్న విప్.. వేములవాడను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాబోయే రోజుల్లోనూ అవసరమైన నిధులు తీసుకొచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వాస్తు జ్యోతిష్యంలో డాక్టరేట్ అవార్డు అందుకున్న:గడ్ దాస్ సత్యనారాయణ.

**బోయినిపల్లి అక్టోబర్ 25 (విజన్ ఆంధ్ర):**
తిరుపతిలో నిర్వహించిన విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలోని సనాతన ధర్మం, వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో,బోయినివల్లి మండలంలో పనిచేస్తున్న గడ్ దాస్ సత్యనారాయణ వాస్తు జ్యోతిష్య రంగంలో డాక్టరేట్ అవార్డును అందుకున్నారు.శుక్రాచార్య వేదాంగ యూనివర్సిటీ నుంచి ఆయన ఈ అవార్డును స్వీకరించారు.గడ్ దాస్ సత్యనారాయణ,తంగళ్ళపల్లి గ్రామ వాస్తవ్యులు,ప్రముఖ వాస్తు జ్యోతిష్య పండితులు,ప్రస్తుతం బోయినిపల్లి మండలంలో 26 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూనే,ఎం పి పి ఎస్,పాఠశాల బూరుగుపల్లి లో ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు.విద్యారంగంలో బాధ్యతలు నిర్వర్తిస్తూ వాస్తు,జ్యోతిష్య శాస్త్రాలపై ఆసక్తితో ఈ గుర్తింపు పొందడం విశేషం.ఈ అవార్డు అందుకోవడం పట్ల ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.విద్యారంగంలో సేవలందిస్తూ అదనంగా వాస్తు జ్యోతిష్య రంగంలో గుర్తింపు పొందడం అభినందనీయమని బోయిని పల్లి మండల,గ్రామ, ప్రజలు,మిత్రులు,తోటి ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.



# పేదల వైద్యానికి ప్రజా ప్రభుత్వమే అండ

(మొదటి పేజీ తరువాయి..)

పేద కుటుంబాల్లో ఎవరైనా తీవ్రమైన అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స అవసరమైనప్పుడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. అలాంటి కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య సహాయ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

### బాలుడి ఆపరేషన్‌కు రూ.5 లక్షల ఆర్థిక సహాయం

తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఆరేళ్ల బాలుడికి వినికిడి సమస్య కారణంగా శస్త్రచికిత్స అవసరమైందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రూ.5 లక్షల సహాయం అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆపరేషన్ అనంతరం బాలుడు మాట్లాడుతుండటంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.
పేదలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందించడం అభినందనీయమని పేర్కొంటూ అశ్విని, మాతృశ్రీ ఆసుపత్రుల యాజమాన్యాలను అభినందించారు.

### ఆరోగ్యశ్రీతో రూ.10 లక్షల వరకు వైద్య సేవలు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి అనేక కుటుంబాలకు భరోసా కల్పించారని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులకు రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా కూడా అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందిస్తూ వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నవారు, శస్త్రచికిత్సలు అవసరమైనవారు పథకాల అర్హతలు, నిబంధనలకు



అనుగుణంగా ప్రభుత్వ వైద్య సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం కీలకం

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చడం ద్వారా ప్రాణాలు కాపాడే అవకాశాలు పెరుగుతాయని ఆది శ్రీనివాస్ అన్నారు. గతంలో ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు పోలీసు, న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో చాలామంది వెనుకడుగు వేసేవారని పేర్కొన్నారు.ప్రమాద బాధితులకు తక్షణ సాయం అందించేలా ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులను ఆదుకునే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించే చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో గోల్డెన్ అవర్ వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనకు ప్రాధాన్యత ఉందన్నారు.విద్య, వైద్యం వంటి మౌలిక రంగాల్లో పేదలకు అండగా నిలవడం ప్రభుత్వాల బాధ్యతని స్పష్టం చేశారు. అనారోగ్యంతో ఏ నిరుపేద కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా, అవసరమైన సమయంలో వైద్య సహాయం అందేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ సంపత్ రెడ్డి, ప్రముఖ వైద్యులు చీకోటి సంతోష్ కుమార్, సత్యనారాయణ స్వామి, సాయికుమార్, పరమేశ్వర్, ప్రవీణ్ వర్మ, హారిక, అనిల్, శ్రీదేవి, మున్సిపల్ అధికారులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు నెలలైనా వెలగని సెంట్రల్ లైటింగ్!

**ఇటీవల కారు ప్రమాదం.. పలువురికి గాయాలు**
**చీకట్లో ప్రయాణం.. ఆందోళనలో గ్రామస్తులు**
**ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై ప్రజల అసహనం**
**సింగరేణి అధికారులు ఆర్ అండ్ బి అధికారులకు వత్తాసా?**

**రామగిరి అక్టోబర్ 25(విజన్ ఆంధ్ర )**



రామగిరి మండలంలోని సింగరేణి ప్రభావిత ముంపు గ్రామమైన రాజాపూర్‌లో కొత్త రోడ్డు నిర్మించి నాలుగు నెలలు గడుస్తున్నా సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో రహదారి చీకటిమయంగా మారడంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఇదే రోడ్డుపై కారు ప్రమాదం జరిగి పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనతోనైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదం జరిగి ప్రజలు ఆందోళన చెందుతున్నా సెంట్రల్ లైటింగ్‌ను అందుబాటులోకి తీసుకురాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.సెంట్రల్ లైటింగ్ సమస్యపై ఆర్ అండ్ బీ అధికారులు గతంలో స్పందించకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి అధికారులకు ఆర్ అండ్ బీ అధికారులు వత్తాసు పలుకుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, రాత్రివేళల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మరో ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు - సైకత శిల్పంతో అభిమానం చాటిన కొమ్మ సతీష్

**జూలపల్లి అక్టోబర్25 (విజన్ ఆంధ్ర):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి గోదావరి తీరాన ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్, దీ=ూ పార్టీ యువజన నాయకులు శ్రీ దాసరి ప్రశాంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు.BRS పార్టీ యువజన నాయకులు కొమ్మ సతీష్ యాదవ్ గోదావరి ఇసుక తీరాన అద్భుతమైన సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసి తన




అభిమానాన్ని చాటుకున్నారు. ప్రశాంత్ రెడ్డి చిత్రపటంతో కూడిన ఈ సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంటోంది.ఈ సందర్భంగా కొమ్మ సతీష్ యాదవ్ మాట్లాడుతూ - విద్యారంగంలో ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్న, యువతకు ఆదర్శంగా నిలుస్తున్న దాసరి ప్రశాంత్ రెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.....

# ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు...

**ఓదెల అక్టోబర్ 25,(విజన్ ఆంధ్ర)**
పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం నాంసానిపల్లి గ్రామానికి చెందిన మల్యాల రమేష్ గౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టు ఎక్కి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజువారి వృత్తిలో భాగంగా రమేష్ గౌడ్ తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తీవ్ర గాయాలయ్యాయన్నారు.గమనించిన తోటి గీత కార్మికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారన్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన బాధితుడిని పరీక్షించిన వైద్యులు 5 పక్కటెముకలు విరగడం జరిగిందని నిర్ధారించారన్నారు. ఈ సందర్భంగా



సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం ఓదెల మండలం,పెద్దపల్లి జిల్లా కమిటీ గాయాల పాలైన మల్యాల రమేష్ గౌడ్ ని పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నుండి వచ్చే ఎక్స్గ్రేషియా ను బాధితునికి తొందరగా అందించేలా చూడాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం తరపున ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు జాగిరి అంజి గౌడ్,పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రావుల రాజు గౌడ్,కాల్వ శ్రీరాంపూర్ మండల నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు గౌడ్,ఓదెల మండల వార్డ్ మెంబర్ పోరం అధ్యక్షులు జాగిర్ కిషోర్ గౌడ్, ఓదెల మండల గౌడ సంఘం నాయకులు జాగిరి వెంకటేష్ గౌడ్,నాంసానిపల్లి మాజీ సర్పంచ్ పోతుగంటి రాజు గౌడ్,స్థానిక గౌడ సంఘం అధ్యక్షులు వీరగోని ఎల్లయ్య గౌడ్, ఉపాధ్యక్షులు వీరగోరి పెద్ద రవి గౌడ్,డైరెక్టర్లు వీరగోని శివప్రసాద్,గోపగాని లక్ష్మయ్య గౌడ్ పాల్గొన్నారు.

# నేత్రదాత పోలోజు నాగమణి సంస్మరణ సభ..

**ఓదెల అక్టోబర్ 25,(విజన్ ఆంధ్ర)**
పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొమిరె గ్రామంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి నేత్రదాత పోలోజు నాగమణి సంస్మరణ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా భీష్మచారి మాట్లాడుతూ సంస్మరణ సభకు వచ్చిన బంధు మిత్రులకు నేత్ర అవయవ శరీర ధానాలపై అవగాహన కల్పించామన్నారు.అనంతరం ముఖ్య అతిధి ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, ప్రతినిధుల చేతుల మీదుగా నేతదాత కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు.ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన నేత్రదాత పోలోజు నాగమణి అభినందన పత్రాన్ని అన్నా వదిన పోలీస్ పద్మ- రమేష్,అల్లుడు- రాకేష్ మౌనిక కుటుంబ సభ్యులు భవాని రమేష్,వెల్లిశోజు ఆనందయ్యలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు క్యాతం మల్లేశం.మేర్గు సారంగం,బాలసాని సంతోష్,జీడి నవీన్,కొంద్ర అఖిల్ పాల్గొన్నారు.